పక్కా గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-సంబేపల్లె (రాయచోటి)

రాయచోటి నియోజకవర్గంలో పక్కా గృహాల నిర్మాణాలకు నాలుగన్నరేళ్ల కాలంలో రూ.186 కోట్ల నిధులను ప్రభుత్వం వ్యయం చేసిందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం నారాయణరెడ్డిగారిపల్లె సచివాలయంలో హౌసింగ్ అధికారులుతో నిర్మాణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కా గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్దిదారులకు బిల్లుల చెల్లింపులలో ఇబ్బందులకు గురిచేయవద్దని సూచించారు. లబ్ధిదారులకి బిల్లులు పెట్టటానికి జియో ట్యాగ్ చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని ప్రజల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇంటి నిర్మాణం చేసి బిల్లులు పడని లబ్ధిదారులకి ఇబ్బంది కలగకుండా వెంటనే ప్రత్యేక చొరవ తీసుకుని బిల్లులు పడేలా చూడాలని పీడీని ఆదేశించారు. ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్‌లను సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ సాంబశివయ్య, ఇన్‌ఛార్జి ఇఇ పూల చంద్రశేఖర్, అన్ని మండలాల ఎఇలు, సర్పంచ్ పూజల అలివేలమ్మ, నాగరాజు యాదవ్, ఎంపిటిసి రాజకుమారి, రఘు, వసంత శ్రీనివాసులురెడ్డి, ఎంపిటిసి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ ఓటర్ జాబితా సవరణపై ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, బిఎల్‌ఒలతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ18-19 వయసు ఉన్న యువత కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి తగువిధంగా అవగాహన కల్పించాలన్నారు. నియోజకవర్గాల వారీగా జిల్లాలో అర్హులైన ఓటర్లు వందశాతం నమోదు కావాలని ఇందుకు మండలాలలో ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ ప్రయివేటు కళాశాలలో ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి 18 సంవత్సరాలు పూర్తయిన ప్రతి ఒకరిని ఓటర్‌గా ఎన్‌రోల్ చేయించాలన్నారు. తహశీల్దార్లు, బిఎల్‌ఒలు ఓటు హక్కు గురించి ఓటు ప్రాధాన్యత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఫారమ్ 6 ఫారమ్-7, ఫారమ్-8 పెండిన్సిలు, అన్ ప్రాసెస్డ్ అప్లికేషన్లను ఎప్పటికప్పుడూ పూర్తి చేసి అప్డేట్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులు వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పరిష్కారం చేయాలన్నారు. రాజకీయ పార్టీల ఫిర్యాదులను ఎప్పటికప్పుడూ పరిష్కరించాలని చెప్పారు. క్లెయిమ్స్ డిస్పోజల్ చేసేటప్పుడు నాణ్యతగా చేయాలన్నారు. జిల్లాలో డుప్లికెట్ ఓటర్లు, ఇతర ప్రదేశాలకు వలస పోయిన వారు, మరణించిన వారు, కొత్తగా వివాహం అయ్యి వేరే ఊళ్లకు వెళ్లిన వారు, వంటి తొలగింపుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ అధికారులు ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశాన్ని సీరియస్‌గా తీసుకొని పనిచేయాలన్నారు. ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీలేఖ, డిఆర్‌ఒ సత్యనారాయణ, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

అనుమతుల్లేని కట్టడాలు తొలగించండి : సిపిఎం

ప్రజాశక్తి-మదనపల్లె

మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేని కట్టడాలు తొలగిస్తారా లేక అడ్డుకోమంటారా అని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ప్రశ్నించారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలు తొలగించాలని శనివారం మున్సిపల్ కమిషనర్‌కు టిపిఎస్ జగదీశ్వర్‌రెడ్డి ద్వారా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పట్టణంలో సామాన్యులు అనుమతి లేని గృహ నిర్మాణాలు చేస్తున్నట్లు తెలిసిన మరుక్షణం సచివాలయం సిబ్బంది నుంచి మున్సిపల్ అధికారుల వరకు వాలిపోయి నానా యాగి చేసి తొలగించే వరకు వదిలిపెట్టరని పేర్కొన్నారు. అలాంటిది చౌడేశ్వరి కల్యాణ మండపం పక్కన ఎలాంటి అనుమతులు లేకుండానే పిల్లర్లు వేసి భారీ భవన నిర్మాణం జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంలోని ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. నిర్మాణం చేస్తున్న నరసింహారెడ్డి ఎమ్మెల్యే చెప్పాడు, అధికారులు అండగా ఉన్నారు నన్ను ఎవరు ఏమీ చేయలేరు, అందుకే అధికారులు ఇటువైపు రాలేరని బాహాటంగా ప్రచారం చేస్తున్నాడని పేర్కొన్నారు. అయినా అధికారులు స్పందించలేదంటే అధికారులు ఎమ్మెల్యే అనుచరులుగా మారిపోయారా అని ప్రశ్నించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో అమ్మచెరువుమిట్టలో అనుమతులు లేవనే పేరుతో పేదల ఇండ్లు కూలగొట్టించిన ఎమ్మెల్యే నవాజ్ బాషకు రింగ్ రోడ్డులో నరసింహారెడ్డి చేస్తున్న అనుమతులు లేని నిర్మాణం ఎలా సక్రమమో వివరించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలు తొల గించాలని లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో అడ్డుకుంటామని హెచ్చరించారు. స్పందించిన టిపిఎస్ టిపిఎస్ జగదీశ్వర్‌రెడ్డి నరసింహారెడ్డికి నోటీసులు అంద జేశామని, స్పందించకపోతే కూల్చివేత నోటీసులు అందజేస్తామని తెలిపారు.

టిపిఎస్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాసులు

వేరుశనగ బస్తాలకు నిప్పు

- పూర్తిగా కాలిపోయిన కాయలు
- రైతుకు రూ.1.50 లక్షల నష్టం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

దుండగులు నిప్పుపెట్టడంతో పూర్తిగా కాలిపోతున్న వేరుశనగ కాయల బస్తాలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రైతు ఆరుగాలం శ్రమిస్తే కానీ బతకలేని ఈ రోజుల్లో చేతికి వచ్చిన వేరుశనగ పంటకు దుండగులు నిప్పు పెట్టి తీవ్ర నష్టాన్ని మిగిల్చిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... నిమ్మనపల్లి పంచాయతీ బుచ్చిరెడ్డిగారిపల్లెకు చెందిన చిన్నరెడ్డెప్ప తనకున్న పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈసారి కూడా తనకున్న పొలంలో వేరుశనగ పంటను సాగుచేశారు. పంట చేతికి రావడంతో వేరుశనగ చెట్లను పెరికి కాయలను విడిపించి శుక్రవారం రాత్రి అక్కడే ఉంచి, శనివారం తెల్లవారుజామున వరకు కాపలా కూడా ఉన్నారు. తెల్లవారుజామున సుమారు 3:30 గంటల సమయంలో విడిపించిన వేరుశనగ కాయలను ఇంటికి చేర్చడానికి రైతు ఇంటికి వెళ్లారు. సుమారు 5 గంటల ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన పి.మల్లప్ప వేరుశనగ కాయలు కాలుతున్నడం గమనించి రెడ్డెప్పకు సమాచారం అందించారు. రైతు చిన్న రెడ్డప్ప హుటాహుటిన అక్కడికి చేరుకొని పరిశీలించగా అప్పటికే 50 మూటల వేరుశనగ కాయలు, తార్పాల్ పట్టలు కాలిపోయాయి. రైతుకు సుమారు రూ.1.50 లక్షలకుపైగా నష్టం వాటిల్లింది. సుమారు మూడు నెలల కిందట తిమ్మాపురానికి చెందిన నలుగురు వ్యక్తులతో గొడవలు జరిగాయి. ఈ గొడవల కారణంగా ఒకరిపై ఒకరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసుకున్నారు. ఇది ఇలా ఉండగా శుక్రవారం మరలా దారి విషయమై నలుగురితో గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలో బాధితుని వేరుశనగ కాయలను, పంటను గొడవలకు పాల్పడిన వారు కాల్చివేసి తీవ్ర నష్టం కలిగించారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని బాధిత రైతు చిన్న రెడ్డెప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు మదనపల్లి రూరల్ సిఐ శివాంజనేయులు, స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి రైతుకు తగిన న్యాయం చేస్తామని పేర్కొన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సిఐ శివాంజనేయులు

చక్కటి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి : ఎస్‌పి

విద్యార్థికి మెమోంటో అందజేస్తున్న ఎస్‌పి కృష్ణారావు

ప్రజాశక్తి - రాయచోటి

విద్యార్థులందరూ చక్కటి ప్రణాళికతో ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్ విద్యను అభ్యసించాల ఎస్‌పి బి.కృష్ణారావు పేర్కొన్నారు. శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డేను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని అధిరోహించి తల్లిదండ్రుల, అధ్యాపకుల కీర్తిని ఇనుమడింపజేసి సమాజాభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకొని ఉన్నత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని, నచ్చిన రంగాన్ని ఎంచుకొని ఉద్యోగ ఉపాధి విస్తరణ దిశగా అడుగులు వేయాలని సూచించారు. సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో 23 ఏళ్ల నుంచి యూనివర్సిటీ పరిధిలో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తూ ఎందరో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించామన్నారు. వీరబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రఘు, పిఆర్‌టియు నాయకులు శ్రీనివాసరాజు మాట్లాడారు. అనంతరం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఎలక్ట్రా నిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాల నుంచి అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థినులు పార్వతి, ప్రియ, హర్షితలను అభినందిస్తూ ల్యాప్ టాప్ కంప్యూటర్స్‌ను బహుకరించారు. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఎంబిఎ విభాగాలలో యూనివర్శిటీ పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపి కలను, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ధ్యేయం : 'గడికోట'

ప్రజాశక్తి - సంబేపల్లె(రాయచోటి)

పేదల జీవితాలలో వెలుగులు నింపాలన్నదే సీఎం జగన్ ధ్యేయమని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం సంబేపల్లె మండలం నారాయణరెడ్డిగారిపల్లె గ్రామ సచివాలయ భవన సముదాయంలో మండలంలోని అసైన్‌మెంట్, ఇనామ్, డికెటి భూముల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిలేని నిరుపేదలకు భూ హక్కు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేస్తోందన్నారు. సంబేపల్లె మండలంలో కొత్త డికెటి భూముల పట్టాలు పొందుతున్న లబ్ధిదారులు 277 మందికి 170.91 ఎకరాలు, ఇనాం భూముల పట్టాలు 534 మందికి 492.92 ఎకరాలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ పేదలకు భూ పట్టాల పంపిణీతో శాశ్వత ప్రయోజనం కలుగుతోందన్నారు. ఎంపిపి ఆవుల నాగశ్రీ లక్ష్మీ మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమం అభివృద్దే జగన్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. సర్పంచుల సంఘ జిల్లా అధ్యక్షుడు చిదంబర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజక వర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతోందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పొత్తూరి రవీంద్ర నాయుడు, మండల వ్యవసాయ సలహా సంఘ అధ్యక్షుడు వాసుదేవ రెడ్డి, సర్పంచులు మోహన్, ముసల్‌రెడ్డి, అంచల రామ చంద్ర, పాల వెంకటరమణ నాయుడు, వెంకట రమణ నాయక్, ఎంపిటిసిలు శ్రీధర్‌రెడ్డి, కాకులపల్లె రమణారెడ్డి, నాయకులు మానవత యర్రపురెడ్డి బ్రహ్మా నందరెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్‌రాజ యాదవ్, శివశంకర్ యాదవ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

జగనన్న పాలవెల్లువను విస్తరించాలి : గిరీష

ప్రజాశక్తి - రాయచోటి : జగనన్న పాలవెల్లువ కార్యక్రమాన్ని విస్తరించాలని కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వికసిత్ భారత్ సంకల్పయాత్ర, రీ సర్వే, క్లస్టర్ల అభివృద్ధి కార్యక్రమం, జగనన్న పాలవెల్లువ, తదితర అంశాలపై విసి ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హాజరయ్యారు. విసి ముగిసిన అనంతరం జిల్లా అధికారులనుద్దేశించి మాట్లాడుతూ జిల్లా అధికారులందరూ జగనన్న పాలవెల్లువ కార్యక్రమాన్ని జిల్లాలోని రైతులందరికీ విస్తరింపజేయాలని, ఇళ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేయాలని, రీ సర్వే కార్యక్రమం పూర్తవ్వాలని, సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణ, ఎస్‌డిసి శ్రీలేఖ, అధికారులు పాల్గొన్నారు.

పొలికేక

ప్రజా'దృష్టి'

మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఎపి మున్సిపల్స్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పొలికేక పెట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో చేపట్టిన పాదయాత్ర సమయంలో మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ కార్మికులు చేపట్టిన నిరసనలు, వంటావార్పు కార్యక్రమం జయప్రదమైంది. మున్సిపల్ కార్మిక నాయకత్వం పోరాటాల వల్ల ఒనగూరే ప్రయోజనాల్ని కార్మిక శ్రేణులకు వివరించే ప్రయత్నం చేసింది. కార్మికులు సైతం నాయకత్వ ఆదేశాల మేరకు ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలపడం గమనార్హం. ప్రభుత్వం కార్మికుల నిరసనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోలీసులను మోహరించింది. పోలీసులు, ఉద్యమకారుల్లో ఎవరి ఎత్తుగడలు ఎలా ఉన్నా ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలపడంలో సిఐటియు సఫలీకృతమైందని చెప్పవచ్చు. దశాబ్దాల తరబడి కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలుపుతూనే ఉన్న సంగతి తెలిసిందే. పనికి తగిన వేతనం ఇవ్వాలని, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, హెల్త్‌రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, సంక్షేమ పథకాలకు వర్తింపజేయాలని కోరుతూ కార్మికులు నినదించారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన వైసిపి సర్కారు పట్ల పెట్టుకున్న ఆశలు అడియాశలు కావడంతో నిరసన బాట పట్టింది. కోవిడ్-19 కార్మికులను ఆప్కాస్ చేర్చాలని, పిహెచ్ డ్రైవర్లకు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని, అడిషనల్ కార్మికులకు పిఎఫ్, ఇఎస్‌ఐ వర్తింప జేయాలని కోరింది. క్లాప్‌డ్రైవర్లకు రూ.18,500, డ్రైవర్లకు రూ.32 వేలు వేతనం ఇవ్వాలని, ఎలక్ట్రీషియన్లకు, స్కిల్డ్, సెమీ స్కిల్డ్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలని, తడిచెత్త, పొడిచెత్త వేరు చేయడంలో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపింది. కొన్నేళ్లుగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూనే ఉంది. కానీ పాలకులకు చెవికి మాత్రం ఎక్కడం లేదు. మెరుగైన జీవన ప్రమాణాలను సాధించుకోవడానికి కనీస వేతనం అత్యవసరం. ఇటువంటి న్యాయమైన హక్కుల సాధనకు ఉద్యమాలు చేయాల్సి రావడం విచారకరం. ప్రజాప్రతినిధులు జీతాలు, అలవెన్స్ పెంపకం విషయంలో ఒకన్యాయం. కార్మికుల విషయంలో మరొక న్యాయాన్ని అవలంభించడం దారుణం. ఇటువంటి ద్వంద్వ విధానా లే నిరసనలకు, ఉద్యమాలకు ఆజ్యం పోస్తున్నాయనే అంశాన్ని గమనంలో ఉంచుకోవాల్సి ఉంది. ప్రతి రోజూ తెల్లవారుజాము నుంచి పారిశుధ్య పనుల్లో నిమగ్నమైన కార్మికులు సమాజాన్ని అనారోగ్యాల బారి నుంచి కాపాడుతున్న వైనాన్ని విస్మరించడం అహేతుకమని గుర్తించాలి. పాలకల వైఖరిని గమనించిన కార్మిక నాయకత్వం కార్మికుల న్యాయమైన హక్కుల సాధనకు ఉద్యుక్తులను చేయాల్సి ఉంది. 2024 సార్వత్రిక ఎన్నికలు ముగింట తమ న్యాయమైన హక్కులను కాపాడుకునేందుకు కార్మిక నాయకత్వం కార్మికులను చైతన్యవంతం చేయాలి. లేనిపక్షంలో మరో ఐదేళ్ల వరకు కార్మికుల న్యాయమైన హక్కులు పాలకులకు పట్టవనే విషయాన్ని వివరించాలి. వారిలోని చైతన్యం ఆధారంగా భవిష్యత్ కార్యక్రమాలకు రూపకల్పన చేసి, కార్మికుల హక్కులను సాధనకు అవసరమైన బృహత్తర కర్తవ్యం నాయకత్వాలపై ఉందని చెప్పవచ్చు.

– ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ముస్లిముల ద్రోహి చంద్రబాబు

- రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ముస్లిం మైనార్టీల ద్రోహి అని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, పీలేరు నియోజకవర్గ వైసిపి మైనార్టీ విభాగం కార్యదర్శి బబ్లూ అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వ పాలనలో నాలుగున్నర ఏళ్ల పాటు మైనార్టీ మంత్రి లేకుండా మైనార్టీ సామాజిక వర్గాన్ని నిర్లక్ష్యం చేశారన్నారు. గతంలో టిడిపి నిర్వహించిన 'నారా హమారా' సభలో మైనార్టీ సామా జిక వర్గానికి న్యాయం చేయాలని అడిగిన పాపానికి ముస్లిం మైనార్టీలపై రాజ ద్రోహం కేసులు పెట్టి తీవ్రవాదుల వలే వేధింపులకు గురి చేశారని, పలు ప్రాంతాల్లో మసీదులను కూల్చివేసారని గుర్తు చేశారు. కిషోర్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలన్న లోపా యకారి ఒప్పం దంతో మైనార్టీ అభ్యర్థి గొంతుకోసి బలి చేశారని, చివరకు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ పదవి నుంచి కూడా మైనార్టీ అభ్యర్థి ఇక్బాల్ అహ్మద్ ఖాన్‌ను తొలగించి కిషోర్‌ను టిడిపిలో చేర్చుకొని మైనార్టీలకు చంద్రబాబు దగా చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు ఉమ్మర్ సాహెబ్, సయ్యద్ బాషా, అబ్దుల్, మస్తాన్, నందమూరి బాల పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్: అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శ్రీపతి డయాగ్నోస్టిక్ కేంద్రం వారి సహకారంతో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో రక్త పోటు, మధుమేహంతో పాటు శరీర ద్రవ్యరాశి సూచిక, హిమోగ్లోబిన్ వంటి పరీక్షలు ఉచితంగా చేశారు. కార్యక్రమంలో కళాశాల అధినేత చొప్పా గంగిరెడ్డి, కోశాధికారి అభిషేక్‌రెడ్డి, చైర్మన్ రామచంద్రయ్య, వై.ప్రదీప్ కుమార్, ఆర్.ప్రదీప్ కుమార్, సుధాకర్, డాక్టర్ గిర్రా శేఖర్, డాక్టర్ ఎం.శిరీష, అధ్యాపక మరియు ఎన్ఎస్ఎస్ బృందం పాల్గొన్నారు.

సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టాలి : డిఇఒ

ప్రజాశక్తి - రాయచోటి

విద్యార్థులలో దాగివున్న సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు తోడ్పడతాయని డిఇఒ శ్రీరామ్ పురుషోత్తం, అన్నారు. శనివారం సాయంత్రం రాయచోటిలోని ఇంటర్‌నేషనల్ మెరిట్ స్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినూత్నంగా ప్రదర్శించిన సైన్స్ నమూనాలు విద్యార్థుల వినూత్న ఆలోచనలకు అద్దం పడుతున్నాయన్నారు. విద్యార్థులందరూ చిన్ననాటి నుండే సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. వైఎస్ఆర్ జిల్లా డిఇఒ రాఘవరెడ్డి మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలన్నా, మానవ మనుగడకు సైన్సు ఎంతగానో ఉపయోగ పడుతోందన్నారు. అనంతరం కలాం విజన్ డైరెక్టర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఈ ప్రాజెక్టుల ప్రదర్శనను ఏర్పాటు చేశామన్నారు.. రెండు రోజులపాటు నిర్వహించిన ఈ సైన్స్ ఎగ్జిబిషన్ నందు 425 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారన్నారు. న్యాయ నిర్ణయితలు వాటిని క్షుణ్ణంగా పరిశీలించి వాటిలో అత్యుత్తమ 30 ప్రాజెక్టులను ఎంపిక చేశారన్నారు. సైన్స్ ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికతోపాటు ప్రశంసాపత్రాలను కూడా అందజేశామన్నారు. కార్యక్రమంలో పిఆర్‌టియు క్రమశిక్షణ సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరాజు, ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహా రెడ్డి, డైట్ లెక్షరర్ శ్రీదేవి, జిల్లా సైన్స్ అధికారి ఓబుల్ రెడ్డి,ఇంటర్ నేషనల్ హైస్కూల్ హెడ్ మాస్టర్ ఇలియా రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు జగన్‌మోహన్‌రాజు

'టిడిపి అధికారంలోకొచ్చేందుకు కృషి చేయండి'

ప్రజాశక్తి-మదనపల్లె

రాబోయే ఎన్నికల్లో టిడిపిని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ముస్లిం మైనార్టీలు కృషి చేయాలని పలువురు నాయకులు అన్నారు. శనివారం స్థానిక ఎన్‌విఆర్ కల్యాణ మండపంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాల ముస్లిం మైనార్టీల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న భూ దందాలు మాఫియా ముస్లిం మైనార్టీలకు ఏమాత్రం న్యాయం చేయలేదని తెలిపారు. టిడిపి వైపు ఉన్న ముస్లిం మైనార్టీ నాయకులపై దాడులు చేయడం, అక్రమ కేసులు బనాయించడం వంటి వాటిపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు షాజహాన్‌బాషా, దొమ్మలపాటి రమేష్, టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చిన్నబాబు, టిడిపి రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎస్.ఎ.మస్తాన్, మాజీ సర్పంచ్ పటాన్ ఖాదర్ ఖాన్, దొరస్వామి నాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్, ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల ముస్లిం మైనార్టీ నాయకులు మౌలానా ముస్తాక్ అహ్మద్, రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు అలీముల్లా, అమీన్‌బాబు, నరసింహ యాదవ్, ఎస్‌ఎం.రఫీ, ముస్లిం మైనార్టీ నాయకులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు

2న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి -రాయచోటి

జిల్లా కేంద్రమైన రాయచోటి సాయి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణంలో డిసెంబర్ 2న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు రాయచోటి పట్టణంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల ఆవరణంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ వారు మెగా జాబ్ మేళా నిర్వహిస్తారన్నారు. ఈ జాబ్ మేళాకు రాష్ట్రంలోని 100 పైచిలుకు వివిధ బహుళ జాతీయ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ప్రస్తుతం మహిళా సంఘాలు, గ్రామ వార్డు సచివాలయాల ద్వారా అభ్యర్థులు రిజిస్టర్ చేసుకుంటున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళాకు హాజరై ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. ఎంపీ మిథున్ రెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి వారి ఆధ్వర్యంలో నిర్వహించే మెగా జాబ్ మేళాకు దాదాపు పదివేల మంది పైచిలుకు నిరుద్యోగ యువత హాజరయ్యే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వర్మన్ అహ్మద్‌ఖాన్, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి హరికృష్ణ పాల్గొన్నారు.

రాజ్యాంగం పట్ల అవగాహన అవసరం : జడ్జి

మాట్లాడుతున్న న్యాయమూర్తి గాయత్రి

ప్రజాశక్తి-పీలేరు

రాజ్యాంగం పట్ల ప్రతి భారతీయుడికీ అవగాహన అవసరమని పీలేరు అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.గాయత్రి తెలిపారు. శనివారం స్థానిక సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగం అతి పెద్ద రాజ్యాంగంగా అవతరించిందని తెలిపారు. మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నాం కాబట్టి ప్రజల చేత, ప్రజల కోసం, ప్రజల కొరకు సరైన నాయకులను మనం ఎన్నుకోబడాలని అది ఒక ఓటుతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదివి గొప్ప నాయకులుగా ఎదగాలని, మన భారత దేశం గర్వించే విధంగా ఉండాలన్నారు. వరకట్నం ఇవ్వడం మరియు తీసుకోవడం తప్పని బాలికలు బాగా చదివి, ప్రయోజకులైతే చదువుతో ఈ వరకట్నం కొంతవరకు నిషేధించవచ్చని పేర్కొన్నారు. అలా చదవకుండా ఇంట్లో పనులకు అలవాటు పడి మన తల్లిదండ్రులపై ఆధారపడి జీవించడం అది మనకి మంచిది కాదని సూచించారు. కార్యక్రమంలో సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రధానం చేశారు. **రాజంపేట అర్బన్ :** అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులకు రాజ్యాంగం మానవహక్కులను ఎలా రక్షిస్తుంది అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు ఎ.మేఘన, ఆర్.శ్రావ్య పి.సానియా గెలుపొందారు. కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వి.నారాయణలు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీన్ అకడమిక్స్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు, హెచ్‌అండ్ఎస్ హెచ్‌ఒడి డాక్టర్ బి.బాలనాగేంద్ర ప్రసాద్, టచ్ స్టోన్ ఇన్‌ఛార్జి పి.విజయ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించాలి

ప్రజాశక్తి-కలకడ

మహిళల పట్ల గౌరవ మర్యాదలను కలిగి ఉండాలని ఎపిఎం వై.రమేష్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన కలకడ వెలుగు కార్యాల యంలో నిర్వహించిన మహిళల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళల పట్ల గౌరవం మర్యాదలు కలిగి ఉండి పురుషులతో సమానంగా హక్కులు ఉన్నాయన్న విషయాన్ని మరవరాదన్నారు. ప్రస్తుతం ఉన్న తరుణంలో లింగ నిర్ధారణ చేసి మహిళలను చిన్న చూపు చూడడం సరికాదని గుర్తు చేశారు. నేటి సమాజానికి మహిళలే మహారాణులుగా భావించి వారికి మనం ఎంతో రుణపడి ఉన్నామని గుర్తు చేశారు.మహిళలు లేనిదే సమాజమే లేదని పేర్కొన్నారు. మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజంలో మహిళలకు పేరు ప్రతిష్టలు వస్తాయని గుర్తు చేశారు. మహిళలు ఇంటిలోని తమ సంతానము నుండి పిల్లల పోషణ వరకు విద్యార్థులు నేర్పించడంలో తమకంటూ స్థానం తెచ్చుకున్నారని ఐసిడిఎస్ సూపర్వైజర్ శాంతమ్మ పేర్కొన్నారు. పుట్టే బిడ్డ కొడుకైనా, కూతురైనా సమానమేనని గుర్తించి కొడుకులతో సమానంగా కుమార్తెలను చూసుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని మహిళా పోలీస్ వాసంతి పేర్కొన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరగుతుందని హెచ్చరించారు. నేటి సమాజంలో మహిళలు, పురుషులకు ఏమాత్రం తీసిపోకుండా అన్ని రంగాలలో రాణిస్తు న్నారని గుర్తు చేశారు. అనంతరం మహిళలు పురుషులు సమానత్వాన్ని చాటుతూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు సిసిలు, సంఘ మిత్రులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **తంబళ్లపల్లె :** మండల కేంద్రంలో శనివారం వైఎస్ఆర్ క్రాంతి పతం మహిళా సభ్యులు జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. మహిళలపై వివక్షత చూపరాదని సిసిలు హంసిరా బేగం ,తులసీలు తెలిపారు. డిసెంబర్ 22వ తేదీ వరకు అవగాహన ర్యాలీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఇవిఇఒఎ లు భారతి, చాంద్‌బాషా, మహిళా సభ్యులు పాల్గొన్నారు. **కంభంవారిపల్లి :** మండలంలోని మహిళా సంఘాలతో పాటు మహిళా శిశు సంక్షేమ శాఖ, స్వయం సహాయ సంఘాల సంయుక్తంగా ర్యాలీ నిర్వహించారు. ఎపిఎం చంద్రకళ మాట్లా డుతూ మహిళలపై జరుగుతున్న హింస , అత్యాచారాలు, ఇతర సామాజిక సమస్యలపై అవగాహన, మహిళా విద్య, బాల్య వివాహాల నిరోధించడం, పోషణ కార్యక్రమాల గురించి మహిళలకు వివరించారు. కార్యక్రమంలో మండల ఎపిఎం చంద్రకళ, ఉప తాసిల్దార్, సిసిలు, సంఘమిత్రాలు మరియు మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు. **పీలేరు:** మండల మహిళా సంఘాలు, మహిళా శిశు సంక్షేమ శాఖ, స్వయం సహాయ సంఘాలు సంయుక్తంగా ర్యాలీ చేశాయి. ఈ సందర్భంగా వక్తలు మహిళలపై జరుగుతూన్న హింస, అత్యాచారాలు, లింగవివక్ష, ఇతర సామాజిక సమస్యలపై అవగాహన, మహిళా విద్య, బాల్య వివాహాల నిరోధించడం, మహిళా ఆరోగ్యం, పోషణ కార్యక్రమాల గురించి మహిళలకు వివరించారు. ర్యాలీలో మహిళలు నినాదాలు చేస్తూ జెండర్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో మండల ఎపిఎం లక్ష్మణ్ రెడ్డితో పాటు, వెలుగు సిసిలు, సంఘమిత్రాలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కలకడ : మహిళలతో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎపిఎం రమేష్

యుపిఎస్‌సిలో అనిల్‌కుమార్‌రెడ్డికి 31వ ర్యాంకు

ప్రజాశక్తి-రామాపురం

అనిల్‌కుమార్‌రెడ్డి

ఇటీవల వెలువడిన యుపిఎస్‌సి-2023 ఇంజినీరింగ్ సర్వీసెస్ పరీక్ష ఫలితాల్లో మండలంలోని చిట్టూరు పంచాయతీ రాఘవరెడ్డిగారిపల్లెకు చెందిన మేరువ అనిల్‌కుమార్‌రెడ్డి ఆలిండియా 31వ ర్యాంకు సాధించాడు. అనిల్ కుమార్‌రెడ్డి వరంగల్ ఎన్ఐటి కళాశాలలో బిటెక్ సివిల్ ఇంజిరింగ్ పూర్తి చేసినట్లు తెలిపారు. బెంగళూరులోని ఎల్ఎల్ఎస్‌సి ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాలలో ఎంటెక్ పూర్తి చేసి యుపిఎస్‌సి నిర్వహించిన ఇఎస్‌ఇ-2023 పరీక్షల్లో ఆలిండియా 31వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. తన తండ్రి ఎమ్.ఎస్. వెంకటరెడ్డి రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ తల్లి నిర్మల గృహిణి అని పేర్కొన్నారు.

మురుగు కాలువలు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-సుండుపల్లి

కాలువలో ఏర్పడిన పిచ్చిమొక్కలు

మండలంలోని మడితాడు గ్రామ పంచాయతీలో బయనేని మాలపల్లెలో డ్రెయినేజీ కాలువలను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు నారాయణస్వామి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో ఇంటిలోకి నీరు వస్తున్నాయని గతంలో కూడా పంచాయతీ అధికారులకు, ఎంపిడిఒ దృష్టికి కూడా తీసుకెళ్లామని, అయినా వారు ఎలాంటి చర్యలు తీసుకో లేదన్నారు. ఇప్పటికైనా అధి కారులు స్పందించి మా గ్రామంలో డ్రెయినేజీ కాలంలో ఏర్పాటు చేయాలని అంతేకాకుండా చేతిపంపు వద్ద గుంతల ఏర్పడి నీరు పోయేందుకు కూడా ఇబ్బందిగా ఉందన్నారు. ఆ గుంతల్లో మలినాలు, కంపచెట్లు, దోమలు స్వైరవిహారం చేస్తుండటంతో దోమలు కుట్టి మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి విష జ్వరాల బారిన పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి డ్రెయినేజీ కాలువ ఏర్పాటు చేయాలని లేకుంటే స్పందనలో కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని ఆ గ్రామస్తులు తెలిపారు.

ఇంటి పట్టాలు మంజూరు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

'ఇంటి పట్టాలు మంజూరయ్యేనా' అనే శీర్షికతో శుక్రవారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు స్పందన లభించింది. నగర పంచాయతీ పరిధిలో అర్హులైన వారికి 90 రోజుల పథకం ద్వారా ఇంటి పట్టాలు మంజూరు చేయవలసి ఉంది.అర్హులను గుర్తించి ఆన్లైన్ చేసి అధికారులు వెరిఫికేషన్ పూర్తి చేసి గుర్తించారు.ఆర్‌డిఒ లాగిన్ లోనే 14 రోజులలోగా అప్రూవల్ కావలసి ఉండగా ఆర్‌డిఒ లాగిన్లోనే 72 రోజులు గడుస్తున్నా కానీ,అప్రూవల్ కాలేదు. తిరిగి జెసి లాగిన్‌లో 67 రోజులు పెండింగ్ ఉండవలసిన రోజులు ఆర్‌డిఒ లాగిన్ లోనే గడిచిపోవడంతో లబ్ధిదారుల సందేహాలు మొదలయ్యాయని ఆ వార్త విశ్లేషించింది. దీనిపై స్పందించిన నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్ మనోహర్ నగర పంచాయతీ విఆర్‌ఒల చేత ఆర్‌డిఒ లాగిన్‌లోఅప్రూవల్ చేయించడంతో అర్హులయిన వారికి ఇంటి మంజూరు చేస్తున్నట్లు ఫోన్ ద్వారా అర్హులైన ప్రజలకు సమాచారం అందించారు. తమ సమస్య పరిష్కారానికి కృషి చేసిన ప్రజాశక్తి దినపత్రికకు, కమిషనర్‌కు, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డికి లబ్దిదారులు ధన్యవాదాలు తెలిపారు.

3న ఎఎన్ఎం రాష్ట్ర స్థాయి సదస్సు

ప్రజాశక్తి-రామసముద్రం

ఎపి గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఎఎన్ఎం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిసెంబర్ 3న విజయవాడ ఎఐటియుసి కార్యాలయంలో జరిగే రాష్ట్ర స్థాయి సదస్సు విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, గ్రామ వార్డు సచివాలయ ఏఎన్ఎమ్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లీలావతి కోరారు. శనివారం రామసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సదస్సు కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో దీపా, సుగుణమ్మనసీం తాజ్, మాధవి, సుకన్య, శ్రీవాణి, జయమ్మ,నిర్మల పాల్గొన్నారు.

మండలానికి వెలిగల్లు నీరు

ప్రజాశక్తి-రామాపురం

రాయచోటి శాసనసభ్యుడు గడికోట శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో వెలిగల్లు నుండి కాలువల ద్వారా నీరు అందించేందుకు విశేష కృషి తో. వెలిగల్లు నీరు మండలానికి చేరుతుందా లేదా అన్న సందేహాలకు తెరదించారు. వెలిగల్లు నుండి కాలువల ద్వారా రామాపురం మండలం లో చిట్లూరు హసనపురం గ్రామపంచాయతీ పరిధిలోని చిన్న ఎట్టికుంట, పప్పిరెడ్డి కుంట, ఇతర చెరు వులకు వెలిగల్లు నీళ్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కాలువల ద్వారా వచ్చే నీటిని ఈరోజు ఆ గ్రామం మాజీ సర్పంచ్ పప్పిరెడ్డి మహేశ్వర రెడ్డి, పప్పిరెడ్డి రవీంద్రా రెడ్డి, హాజీముల్ల సర్పంచ్ ఇతర గ్రామస్తులు. పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు హర్షం వ్యక్తం చేశారు.

గ్రామాల్లో సమస్యల్లేకుండా చూడండి

ప్రజాశక్తి-గాలివీడు

గ్రామీణ ప్రాంతాల్లో ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని లక్కిరెడ్డిపల్లి సిఐ జిజె గంగనాథ్‌బాబు పేర్కొన్నారు. శనివారం గాలివీడు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో చుట్టుపక్క గ్రామాలు, పల్లెల్లో ఎటువంటి సమస్యలు లేకుండా పోలీసులు కేటాయించిన గ్రామాన్ని పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. పోలీసులతో సమావేశం ఏర్పాటు చేసి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ ఆంజనేయరెడ్డి, రైటర్ అల్తాఫ్ సిబ్బంది శ్రీరాములు, గణపతిరాజు, సుమియా, సుధాకర్‌బాబాపాల్గొన్నారు.

మెరుగైన విద్యను అందించాలి

ప్రజాశక్తి-కలికిరి

విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలని క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు బి.సంపత్‌కుమార్ సూచించారు. కలికిరి జడ్‌పిహెచ్ఎస్, ఇందిరమ్మకాలనీ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు విద్యాభోధనపై పలు సూచనలు, సలహాలు అందించరు. విద్యార్థులతో టెస్ట్ బుక్స్, వర్క్ బుక్ కరెక్షన్ గురించి, పాఠ్యంశాల ప్రణాళిక గురించి వివరించారు. కార్యక్రమంలో సిఆర్‌పి రియాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి : ఎంపిపి

ప్రజాశక్తి- కలకడ

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని ఎంపిపి శ్రీదేవిరవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీలో ఉన్న సచివాలయంలో శనివారం వై నీడ్స్ ఎపి జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లేబోర్డు ప్రదర్శన, వైసిపి జెండా ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కులం, మతం, పార్టీ బేధం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కోసం మరోమారు వైసిపిని ఆదరించాలని కోరారు.ప్రతిపక్ష పార్టీల ప్రలోబాలకు లొగ్గకుండా విశ్వసనీయతకు పట్టం కట్టి మరోమారు జగన్‌మోహన్‌రెడ్డిని సిఎంను చేయాలని కోరారు. కార్యక్రమానికి మండలంలోని వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, ఇఒఆర్‌డి లతీఫ్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపిపి శ్రీదేవి రవికుమర్

టిడిపితోనే భవిష్యత్తుకు గ్యారంటీ : ఆర్‌జె

ఇంటింటి ప్రచారంలో టిడిపి నాయకులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

టిడిపితోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ ఉంటుందని టిడిపి రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం నిమ్మనపల్లి మండలం ఎగువమాచిరెడ్డిగారిపల్లిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమన్నారు. టిడిపి మేనిఫెస్టోలో ఆర్‌టిసి బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తారన్నారని, సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తారని చెప్పారు., 18 ఏళ్లు నిండిన ఆడబిడ్డలకు నెలకు రూ.1500 రూపాయలు ఇస్తారని, నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు నగదు ఇస్తారని చెప్పారు. రైతులకు అన్నదాత పథకం కింద సంవత్సరానికి రూ.20వేలు అందిస్తారని తెలిపారు. చదువుకున్న పిల్లలు ఇంటిలో ఎంతమందిఉంటే అంతమందికి ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున నగదును ఇచ్చే విధంగా మేని పెస్టోను రూపొందించారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రాజంపేట బిసి మహిళా ప్రధాన కార్యదర్శి విజయమ్మ, బూత్ ఇన్‌ఛార్జిలు గోపన్నగారి శంకర, శ్రీరాములు పాల్గొన్నారు.

నాణేల సేకరణలో భళా..!

సేకరించిన కరెన్సీ నాణేలతో ఉపాధ్యాయుడు కుమార్

ప్రజాశక్తి-కలికిరి

ఆయన వృత్తి ఉపాధ్యాయుడు. ప్రవృత్తి విదేశీ కరెన్సీ నాణేలు సేకరణ. కలికిరి పట్టణానికి చెందిన ఉపాధ్యా యుడు కుమార్‌యాదవ్. వాల్మీకిపురం మండలం కొత్తకురవపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. తన హైస్కూలు విద్య నుంచే నాణేల సేకరణ ఆలోచన వచ్చి, నాటినుండే పెద్దల ద్వారా, బంధువులు, స్నేహితులు ద్వారా పురాతన నాణేలు సేకరించి భద్రపరచడం ఆరంభించారు. అలా 1835 నాటి పురాతన నాణేల తోపాటు నయాపైసా, అడ్డగ, అణాలు, అర్ధణాలు, పైసా, జార్జ్ కింగ్, ఎలిజబెత్ ల చిహ్నాలతో కూడిన రాగి, ఇత్తడి, అల్యూమినియం నాణేలను సేకరించారు. వివిధ దేశాలైన అమెరికా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, సింగపూర్, జర్మనీ, జపాన్, ఫిలిప్పీన్స్, జోర్డాన్, మాల్దీవులు, కువైట్, సౌదీఅరేబియా, దుబాయ్, మలేసియా, అరబ్ ఎమిరేట్స్, చైనా, బహ్రెయిన్ వంటి దేశాల నాణేలు కరెన్సీ కూడా సేకరించారు. వివిధ దినోత్సవాల సందర్భంగా విడుదల చేసిన రకరకాల చిహ్నాలతో కూడిన ప్రముఖ వ్యక్తుల చిత్రాలతో కూడిన నాణేలు వంటివి వందల సంఖ్యలో సేకరించగలిగారు. ఈ నాణాలు గత భారత చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయం, పరిపాలన, ప్రకృతి, విజయాలకు తార్కాణాలుగా, ఆధారాలుగా నిలుస్తాయని ఉపాధ్యాయులు కుమార్ తెలిపారు. ఈ పురాతన విదేశీ నాణేలు, కరెన్సీలను అపుడప్పుడు సందర్భానుసారంగా ప్రదర్శన చేసి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. చూసిన విద్యార్థులు ఎంతో ఆసక్తిగా తిలకించారని, నేటి నాణెలుకు పురాతన నాణెలు పోల్చి చూసుకుంటూ వాటి విలువలను అడిగి తెలుసుకుంటుంటారని ఇది తనకెంతో సంతోషాన్నిస్తుందని తెలిపారు. ఇకమీదట కూడా భారతీయ నాణేలతోపాటు, విదేశీ నాణేలు, కరెన్సీని సేకరిస్తునే ఉంటానని తెలిపారు. రాబోయే తరాలకు స్వదేశీ, విదేశీ నాణేలు, కరెన్సీతోపాటు సంస్కృతి, సాంప్రదాయాలు, చరిత్రను తెలిపే ప్రయత్నం కొనసాగిస్తునే ఉంటానని తెలిపారు. ఉపాధ్యాయుడి ఉన్నతమైన అలవాటును పలువురు ప్రశంసించారు.వృత్తిపట్ల నిబద్ధతను ప్రదర్శిస్తూ జిల్లాస్థాయిలో అధికారులు నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును కూడా పొందడం విశేషం.

క్రీడా మైదానం కోసం స్థల పరిశీలన

మైదానం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూసిబ్బంది

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలో క్రీడా మైదానం కోసం అనువైన స్థలాన్ని శనివారం వైసిపి నాయకులతో కలిసి పరిశీలించినట్లు తహశీల్దార్ రఫీక్‌అహ్మద్ పేర్కొన్నారు. కొంతమంది యువకులు శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పర్మాన్ అహ్మద్‌ను కలిసి బి.కొత్తకోట క్రీడా మైదానం కొరకు వినతి పత్రం అందజేశారు.జెసి ఆదేశాల మేరకు తహశీల్దార్ బెంగళూరు రోడ్డు, మోడల్ స్కూల్ హాస్టల్ వెనుక భాగం వున్న ప్రభుత్వ భూమిని పరిశీలించి సుముఖత వ్యక్తం చేశారు. వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్‌అహ్మద్ ఆధ్వర్యంలో స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎంతో మంది యువతకు వివిధ రకాల క్రీడల్లో ప్రావీణ్యం ఉందన్నారు. వారికి సరైన మైదానం లేకపోవడంతో ప్రాక్టీస్ చేసుకునేందుకు ఇబ్బందిగా ఉందన్నారు. జాయింట్ కలెక్టర్ సూచనలతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి సహకారంతో పట్టణంలో త్వరలో ఓ అద్భుతమైన క్రీడామైదానం నిర్మించబోతున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ నాసిర్‌వల్లి, తబ్బు, బావాజాన్ (షిట్టు),సిద్దిక్, మొహమ్మద్ ఇర్ఫాన్, పవన్, గంగా, సబ్జి, ఇమ్రాన్, షరీఫ్, బషీర్,నయాజ్ పాల్గొన్నారు.

భూ పంపిణీతో శాశ్వత ప్రయోజనం : 'గడికోట'

ప్రజాశక్తి-గాలివీడు

భూ పంపిణీతో పేదలకు శాశ్వత ప్రయోజనం కలుగుతుందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొ న్నారు. శనివారం ఫంక్షన్‌హాల్లో జరిగిన పేదలకు భూ పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఏళ్ల తరబడి నుంచి భూమి సాగు చేసుకుని హక్కులు లేని రైతులకు, భూమిలేని నిరుపేదలకు భూపంపిణీతో శాశ్విత ప్రయోజనం కలుగుతుందని అన్నారు. అసైన్మెంట్ భూములు, ఇనాం భూముల పట్టాల పంపిణీలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ గాలివీడు మండలంలో తొలివిడతగా అసైన్మెంట్ కమిటీ కి సంబంధించి 118 పట్టాదారులకుగాను 141.36 ఎకరాల విస్తీర్ణపు భూములుకు పట్టాలు అందచేసి,వాటికి సమగ్రమైన రికా ర్డులతో అందిస్తున్నారన్నారు. ఇనాం భూములకు సంబంధించి 604 మంది పట్టాదారులకు 547.15 ఎకరాల విస్తీర్ణాన్ని రైతులకు పట్టాలుగా ఇవ్వడం జరుగుతోందన్నారు.త్వరలో అసైన్మెంట్ రెగ్యులరైజ్ చట్టం ద్వారా 4753 మంది రైతులకు 7982 ఎకరాల విస్తీర్ణాన్ని పట్టాలుగా అందచేయడం జరుగుతుందన్నారు కార్యక్రమంలో మండల కన్వీ నర్ మిట్టపల్లి యదుభూషణ్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాధ రెడ్డి, వైస్ఎంపిపి గాలి శ్రీనివాసులు, మండల జెసిఎస్ కన్వీనర్లు ఖాదర్ మోద్దీన్, నల్లాబత్తుని వెంకట రెడ్డి, మాజీ ఎంపిపి బండి చిన్న రెడ్డి, వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి గుమ్మ అమరనాథ్ రెడ్డి, సర్పంచ్‌లు ఉమాపతిరెడ్డి నాయకులు పాల్గొన్నారు

భూ పట్టాను అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

డాక్టర్ సుబ్బారెడ్డికి ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లెలోని భవ్య చిన్నపిల్లల వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ ఎవి.సుబ్బారెడ్డికి రాష్ట్ర ఐఎంఎ మూడు ఉత్తమ సేవా అవార్డులు అందించారు. శనివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అందించినట్లు డాక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు. ఐఎంఎశాఖలో ఉత్తమ సేవలందించినందుకు మూడు అవార్డులు ఇచ్చారన్నారు. రాష్ట్రంలో అత్యధిక ఐఎంఎ మెంబర్‌షిప్ చేసినందుకు ఒకటి, స్టేట్ ఆఫీస్ బేరర్‌ల అందరిలో అత్యధిక ప్రతిభతో పనిచేసి నందుకు ఒక అవార్డు, రాష్ట్రంలోని అన్ని ఐఎంఎ బ్రాంచ్‌లలో ఎక్కువ కార్యక్రమాలు, సిఎంఇలు మదనపల్లిలో చేసినందుకు ఒక అవార్డులను రాష్ట్ర శాఖ అ,దిచొనట్లు తెలి పారు. రాయ లసీమ జోన్ లోని పల మనేరు, పీలేరులో కొత్త ఐఎంఎ బ్రాంచ్‌లు ఏర్పాటు చేసినందుకు ఒక అవార్డుల వచ్చాయ న్నారు.తన ప్రతిభను గుర్తించి అవార్డులు ఇవ్వడం సంతోష మని తనపై బాధ్యత , బరువు మరింత పెరిగిందన్నారు.

అవార్డు అందుకుంటున్న డాక్టర్ సుబ్బారెడ్డి

పుస్తకాలతో స్నేహం చేయాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని టి.కమ్మపల్లిలో శనివారం గ్రంథాలయ ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని గ్రంథాలయ నిర్వాహకుడు జి.శీను ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ పెద్ద కాపర్ల చంద్రశేఖర్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనంతో విజయాలు సాధ్యమవు తాయని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలలో ఉపయోగపడే మాదిరి ప్రశ్నాపత్రాల మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ మాట్లాడుతూ 'చిరిగిన చొక్కా అయినా వేసుకో కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో అది నీ జీవితాన్ని మారుస్తుందన్న గురజాడ సందేశాన్ని ప్రతి విద్యార్థి అనుసరించాలని తెలిపారు. విద్యార్థులు చక్కటి లక్ష్యంతో తమ ఉజ్వల భవిష్యత్తులకు బంగారుబాట వేసుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ విలువైన సమయాన్ని వృథా చేయకుండా వీలు దొరికినప్పుడల్లా గ్రంథాలయాలకు వెళ్లి దినపత్రికలు, వార, పక్ష, మాస పత్రికలు, ప్రముఖుల జీవిత చరిత్రల పుస్తకాలు చదివి స్ఫూర్తి పొందాలని తెలిపారు. గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంచే భాండాగారాలని, గ్రంథాలయాలు అందరిని ఉన్నతులుగా తీర్చిదిద్దే సర్వతీ నిలయాలని తెలిపారు. ఇక్కడ విజ్ఞానాన్ని వృద్ధి చేసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు రమణారెడ్డి, ఉపాధ్యాయులు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, బాల నరసింహులు, ఆసిఫ్‌బాషాపాల్గొన్నారు.

మృతుడి తల్లికి వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

స్థానికశాంతినగర్‌లో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతా నికి గురై మృతి చెందిన సోడిశెట్టి వెంకటేష్ తల్లి రత్నమ్మకు వైఎస్ ఆర్ బీమా ద్వారా మొదటి విడతగా పదివేల రూపాయల చెక్కు ను కోడూరు సర్పంచ్ బుడిగి శివయ్య, ఉపసర్పంచ్ తోట శివ సాయి చెక్కును అందించారు. కార్యక్రమంలో కోడూరు పట్టణ వైసిపి అధ్యక్షుడు సిహెచ్ రమేష్‌బాబు, స్థానిక వార్డు మెంబర్ పోకల యోగానంద, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటరెడ్డి పాల్గొన్నారు. **పీలేరు:** అనారోగ్యంతో మృతి చెందిన మహిళ కుటుంబానికి వైఎస్ఆర్ బీమా తక్షణ ఆర్థిక సాయంగా రూ.10 వేలు అందజేసినట్లు వగళ్ళ పంచాయతీ సర్పంచ్ రామకొండారెడ్డి తెలిపారు. కెవిపల్లి మండలం, వగళ్ల పంచాయతీ, బుర్రావాండ్లపల్లికి చెందిన బి. నాగమల్లయ్య భార్య బి.లక్ష్మీదేవి కిడ్నీ సమస్య కారణంగా శనివారం మృతి చెందింది. దీంతో వైస్సార్ బీమా తక్షణ సహాయంగా రూ.10 వేలు నామినీకి సర్పంచ్ రామకొండరెడ్డి, మాజీ జడ్‌పిటిసి జయరామచంద్రయ్య అందించారు.

అభివృద్ధి ప్రణాళికను పక్కాగా చేపట్టాలి

ప్రజాశక్తి-గాలివీడు

పాఠశాల అభివృద్ధి ప్రణాళికను ప్రతి ప్రధానోపాధ్యాయుడు సమగ్ర విద్యా ప్రణాళిక నమూనాను కూడా సిద్ధం చేయాలని ఎంఇఒలు పిల్లి నాగరాజు, వేల్పుల శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం బాలికల ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సందర్భంగా వారు ప్రధానోపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. సకాలంలో పాఠశాల అభివృద్ధి నమూనాలు సిద్ధం చేయాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధాకర్, దుర్గేశ్వరరాజు, మెహద్దీన్, సివి.రమణ , ఎం.జయన్న, రమణయ్య పాల్గొన్నారు.

నూతన సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కలికిరి

నూతన సాంకేతిక ప్రదర్శనలను రైతుల సద్వినియోగం చేసుకోవాలని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ పాండురంగ తెలిపారు. డిసెంబరు 3 నుంచి 5 వరకు అగ్రిటెక్ -2023 ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మూడు రోజుల అగ్రిటెక్-2023 ప్రదర్శన ఉంటుందని ఆయన తెలిపారు. ఈసదస్సులో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవిష్కరించిన నూతన సాంకేతిక ప్రదర్శన జరుగుతుందన్నారు. ఈ సదస్సులో నూతన వంగడాలు, ప్రకృతి వ్యవసాయం, సహజ వనరుల పరిరక్షణ, వ్యవసాయ యాంత్రీకరణ, పంటల సాగు వివరాలు, వ్యవసాయ అనుబంధ శాఖల ప్రదర్శనలు, డ్రోన్ల ప్రదర్శన చేయడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

శస్త్ర చికిత్సకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రైల్వే కోడూరు

బాధితుడికి చెక్కును అందిస్తున్న సాయివికాస్‌రెడ్డి

నియోజకవర్గ పరిధిలోని నిరుపేదలకు ఏ కష్టం వచ్చినా తోడుగా నేనుంటానని ముక్కా సాయి వికాస్‌రెడ్డి భరోసా నిస్తున్నారు. పట్ట ణంలోని షేక్ అబ్దుస్ రఫీ అహమ్మద్ కుమా రుడు బషీర్‌అహ్మద్ లెగ్మెంట్ శస్త్ర చికిత్సకు రూ.30 వేలును ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ తరుపున సాయి వికాస్ రెడ్డి అందించారు. కార్యక్రమంలో నిజామ్ కరీముల్లా , షంశీర్ బాషా, రఫీఅహ్మద్, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, ముక్కావారిపల్లి సర్పంచ్, అరవ శ్రీధర్, మహబూబ్‌బాషా, ప్రవీణ్ , మౌల ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి

రాజంపేట అర్బన్ : ట్రాఫిక్ నిబంధనల పట్ల విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని పట్టణ సిఐ ముత్తయ్య ఆచారి వివరించారు. భువనగిరిపల్లి సమీపంలోని శ్రీ చైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఫ్లెక్సీలు పట్టుకొని ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. రహదారివెంట ఎడమవైపు ప్రయాణించాలని, జీబ్రా క్రాసింగ్ వద్దనే రోడ్డు దాటాలని, వాహనాలు నడిపేటప్పుడు.. రోడ్డులో నడిచేటప్పుడు మొబైల్ ఫోన్లు వాడరాదని,నిదానమే ప్రధానమని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎజిఎం రమణయ్య, మొదటి బ్రాంచి ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్‌రెడ్డి, మొదటి బ్రాంచి ప్రిన్సిపల్ స్వాతి, కో-ఆర్డినేటర్ కుటుంబరావు పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశుభ్రతను పాటించాలి

మదనపల్లె : స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నందు ప్రిన్సిపల్ గోపతి బాలకృష్ణ మూర్తి అధ్యక్షతన శనివారం ఆరోగ్య సమస్యలు పరిశుభ్రత వ్యాధుల పట్ల అవగాహన నివారణ చర్యలు పై విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు అనంతరం జిల్లా కుష్టు వ్యాధి నివారణ అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు నివారణ చర్యల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీదేవి,సతీష్ కుమార్ రెడ్డి, శ్రీనివాసులు, రమణ ,గంగయ్య మరియు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు

పోరాటానికి సిద్ధం కావాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యార్థులకు, యువతకు అందరికీ విద్య, ఉపాధికై పోరాటాలకు సిద్ధం కావాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు నేతి నాగేశ్వర పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని నారాయణాద్రి ఇంజనీరింగ్ కళాశాలలో పిడిఎస్‌యు 4వ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజవర్గ ప్రాంతంలో కరువు కాటకాలతో నిరుద్యోగ యువకులు ఇంజినీరింగ్, డిగ్రీలు పూర్తి చేసుకొని తగిన ఉద్యోగాల్లేక ఉపాధి కోసం వలస వెళుతున్నారని అన్నారు నూతన కమిటీ ఏకగ్రీవంగా 13 మందితో ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షులుగా హరినితిన్, కార్యదర్శి మహమ్మద్ గౌస్, సహాయ కార్యదర్శి పృథ్వి, కోశాధికారి ఎస్.సాదిక్ పాల్గొన్నారు.

500 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా తయారీ చేస్తున్న నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పి బి.కృష్ణారావు ఆదేశాల మేరకు మండలంలోని నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో మండలంలోని గండబోయనపల్లి పంచాయతీ మేకలవారిపల్లి అటవీ ప్రాంతంలో నాటుసారా ఊట 500 లీటర్లను ధ్వంసం చేసినట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా నాటుసారా అక్రమ రవాణా, తయారీ, కర్ణాటక మద్యం అక్రమ రవాణా జరిగితే తమకు సమాచారం అందించాలన్నారు. అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, చట్టపరమైన కేసులు నమోదు చేస్తామనిహెచ్చరించారు. ఈ దాడుల్లో ఎసఐ క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.